# అపూర్వ ప్రేమాశ్రమం అను పాపపు కథ



ఆదివారం నాడు మా నిర్భయ్‌నగర్ కాలనీ వాళ్ళందరం నిశ్చింతగా ఉదయం తొమ్మిందింటివరకూ నిద్రపోవాలని కలలు కనటం – మా కలల్ని మా కాలనీ ఆర్గనైజింగ్ శెక్రటరీ శాయీరామ్ ఏదోవిధంగా భగ్నం చేయడం మీ అందరికీ తెలిసిన సంగతే కదా!

అంచేత ఆ శనివారం రాత్రి కాలనీలో చాలామందిమి కలసి ఊరేగింపుగా శాయీరామ్ ఇంటికి వెళ్ళాం.

“బాబ్బాబు! మేమంతా రేపు ఉదయం తొమ్మిదింటి వరకూ హాయిగా నిద్రపోవాలని,

రోజంతా హాయిగా భార్యాబిడ్డలతో గడపాలనీ నిశ్చయించుకున్నాం. గనుక రేపొక్కరోజు మమ్మల్ని మీటింగులూ, గొడవలూ లేకుండా వదిలేస్తే చచ్చి నీకడుపున పుడతాము" అన్నాడు గోపాల్రావ్.

"భలేవారే దాన్దేముంది! అంతగా కావాలంటే మీరు నిద్రలేచాకే మీటింగ్ పెట్టుకుందాం!" అన్నాడు శాయీరామ్ చిరునవ్వుతో.

"బాబోయ్! అంతమాటనకు. అసలు రేపు నువ్వు మా ఇంటికి రావద్దు" బ్రతిమాలాడు రంగారెడ్డి.

శాయిరామ్ అయిష్టంగానే అంగీకరించాడు.

ప్రోగ్రాం ప్రకారం కాలనీ వాళ్ళందరం నిద్రలో కరిగిపోతున్నాం. అంతలోనే హఠాత్తుగా లాంగ్ విజిల్స్ వినిపించేసరికి నాకు నిద్ర కాస్తా చెడిపోయింది. ఆ విజిల్స్ వెనుకే పిల్లల కోలాహలం. కేకలూ, అరుపులూ వినిపించేసరికి కళ్ళు తెరవక తప్పలేదు.

టైము ఏడే అయిందప్పటికి.

శాయీరామ్ మీద కోపంతో లేచి ఇంట్లో నుంచి బయటికొచ్చి చూశాను.

అప్పుడే మిగతా కాలనీ వాళ్ళందరూ కూడాఇళ్ళల్లో నుంచి బయటికొస్తున్నారు నిద్రకళ్ళతో.

కాలనీ మధ్యలో కొంతమంది చిన్న పిల్లలు చినిగిన బట్టలతో లైనుగా నిలబడి ఉన్నారు.

శ్యామల్రావ్ మధ్యలో నిలబడి పుస్తకంలో ఏదో రాసుకుంటున్నాడు.

శ్యామల్రావ్ కొడుకు పిల్లలందరినీ లైన్లో నుంచోబెడుతున్నాడు.

ఆ గొడవ శాయీరామ్ తాలూకూ మీటింగ్‌ది- కాదని తెలిశాక మాక్కోపం తగ్గిపోయింది.

కుతూహలం కొద్దీ వాళ్ళ దగ్గరకు చేరుకున్నామందరం.

ఆ పిల్లలను చూడగానే గుర్తుపట్టాము.

ఆ మధ్య మతకల్లోలాలు జరిగినప్పుడు తల్లిదండ్రులిరువురినీ పోగొట్టుకుని, ఆదరించేవారు లేక తిండికోసం కర్ఫ్యూ ఏరియాదాటి మా కాలనీలో కొచ్చి అడుక్కోవటం పెట్టారు. వారిలో పూటకు గడవని కుటుంబాల పిల్లలూ, మధ్యతరగతి కుటుంబాల పిల్లలూ, ముస్లిమ్‌ల పిల్లలూ, హిందువుల పిల్లలూ అందరూ ఉన్నారు. వాళ్ళు మా కాలనీలో కొచ్చి ఇంగ్లీష్‌లోనూ, ఉర్దూలోనూ, తెలుగులోనూ "ఆకలేస్తుంది! అన్నం కావాలి" అని కళ్ళల్లో నీళ్లు నింపుకుని అడుగుతూంటే మా కాలనీ వాళ్ళందరం జాలిపడి, వారి కథంతా తెలుసుకుని అందరికీ ఎంతో కొంత భోజనం ఏర్పాట్లు చేశాము. వాళ్ళు కాలనీలో తలో ఇంట్లో భోజనం చేసి మేమిచ్చిన పాత దుప్పట్లూ దుస్తులూ, వాడుతూ

మా కాలనీ వరండాల్లోనే గడుపుతున్నారు.

ఇప్పుడు శ్యామ్రావ్ వాళ్ళనే కాలనీ మధ్యకు చేర్చి అందరి పేర్లూ రాసుకుంటున్నాడు.

ఆ తరువాత ఫోటోగ్రాఫర్ వచ్చి వాళ్ళందరి గ్రూప్ ఫోటోలూ వివిధ కోణాల్లో తీసుకుంటున్నాడు. ఆఖర్లో మరీ చిక్కి శల్యమైపోయిన ఓ ఏడేళ్ళ పాపను ప్రత్యేకంగా ఫోటోలు తీసాడు.

"ఏమిటిదంతా?" రంగారెడ్డి ఆశ్చర్యంగా అడిగాడు శ్యామ్రావ్ని.

"ఏమిటా? కనబడ్డంలేదూ? దరిద్రం! కటికదరిద్రం. మనందరం రెండుపూటలా కడుపునిండా భోజనం చేస్తూ ఉదయం తొమ్మిదింటి వరకూ నిద్రపోతూంటే– మన పక్కనే ఉన్న ఈ చిన్నారి పాపలు ఒక్క పూటయినా తిండిలేక ఆకలితో అలమటిస్తున్నారు. ఎంతకాలం వీరినీ దారుణమైన పరిస్థితిలో చూడటం? అందుకే వీరి బాధలు నాచేతనయినంత వరకూ రూపుమాప దలచుకున్నాను– వీరికోసం ఓ ఆశ్రమం పెట్టి నేనే పోషించదల్చుకున్నాను– భావి భారత పౌరులు వీళ్ళు. వీళ్ళను నా దేశం నిర్లక్ష్యం చేసినా నేను చేయను–" ఆవేశంగా అన్నాడతను.

ఆ స్పీచ్కి మేమంతా ఎంత చలించి పోయామంటే– అలా మాట్లాడింది శ్యామ్రావ్ కాక ఇంకెవరయినా అయివుంటే అయిదు నిమిషాల పాటు కరతాళ ధ్వనులు చేసేవాళ్ళం.

శ్యామ్రావ్ స్వార్థం గురించీ "గెట్ రిచ్ క్విక్" మెంటాలిటీ గురించీ మాకు క్షుణ్ణంగా తెలుసు కాబట్టి అందరం అనుమానంగా మొఖాలు చూసుకున్నాం.

"నిజంగా మీరు చేయబోయేది అద్భుతమయిన సేవసార్. రేపే మీ గురించి మా పేపర్లో హెడ్లైన్స్ లాగించేస్తాను. "అనాథ పాపాలకు తాత– శ్యామ్రావ్ దాత" ఎలా వుంది?" అన్నాడు గోపాల్రావ్ శ్యామ్రావ్ స్పీచ్కి కదిలిపోయి.

శ్యామ్రావ్ చిరునవ్వు నవ్వాడు.

"పరమ శివుడి అనుజ్ఞ మేరకు నిర్వహిస్తున్న ఈ మహోన్నత కార్యక్రమానికి ప్రచారం వద్దు నాయనా. అంతా ఈశ్వరేచ్ఛ!"

అంటూ ఆ పిల్లలందరినీ వరుసగా లైన్లో తీసుకెళ్ళిపోయాడు.

మేము మరి కాసేపటికి తర్వాత మా ఇంట్లో సమావేశమయ్యేసరికే జనార్ధన్ ఓ న్యూస్ తీసుకొచ్చాడు.

శ్యామ్రావ్ ఇంటికి అపూర్వ ప్రేమాశ్రమం అన్న బోర్డు పెట్టారుట.

"తమాషాగా ఉందే. ఒకవేళ శ్యామ్రావ్ నిజంగానే నిస్వార్థపరుడిగా మారలేదు కదా?" అడిగాను నేను.

"అది మాత్రం నేను నమ్మను" అన్నాడు శాయీరామ్.

"అవును. మేమూ నమ్మం." అన్నారు మిగతావాళ్ళు.

"మారకపోతే మరి అంతమంది పిల్లలకు భోజనం ఎలా పెడతాడు?" అడిగాడు

రంగారెడ్డి.

ఎవ్వరం మాట్లాడలేదు. వారం రోజులు గడిచిపోయినయ్. అందరం రోజూ ఏదొక వంక పెట్టుకుని శ్యామ్రావ్ ఇంటి మీదుగా రౌండ్స్ కొడుతూ లోపలేం జరుగుతుందో తెలుసుకోడానికి ప్రయత్నాలు చేయసాగాము గానీ ఏమీ తెలీటం లేదు.

హఠాత్తుగా ఓ రోజు మధ్యాహ్నం ఓ చిన్న లారీలో నాలుగయిదు పెద్ద పెద్ద పాకేజీలు శ్యామ్రావ్ ఇంటికి చేరడం మా కాలనీలో ఆడాళ్ళందరూ చూశారు.

ఇది జరిగిన రెండో రోజున ఆశ్రమం పిల్లందరూ రంగు రంగుల బట్టలతో ముచ్చటగా కాలనీ మధ్య కాసేపు డ్రిల్ చేయటం నేర్చుకున్నారు.

ఆ రాత్రి మళ్ళీ సమావేశం జరిగింది మా ఇంట్లో.

"శ్యామ్రావ్ సంగతి ఏమాత్రం అంతుబట్టటం లేదు. ఆ పిల్లలందరికీ అంత ఖరీదయిన బట్టలెలా కుట్టించాడో–" అన్నాడు జనార్ధన్.

"అదే నాకు అర్థం కావటం లేదు. ఏదో కొంపలు ముంచే కార్యక్రమం చేపట్టాడనటం మాత్రం ఖాయం!" అన్నాడు రంగారెడ్డి.

"ఇప్పుడే మనందరం ఏదొక విధంగా వాడి కార్యక్రమాలు కూపీ లాగకపోతే మన కాలనీని మనకు తెలీకుండా ఎవరికో అమ్మేస్తాడు" అన్నాడు శాయిరామ్.

"మరి ఆ డిటెక్టివ్ పని ఎవరు చేస్తారు?" అడిగాను నేను.

"ఇంకెవరు? మన డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరే ఇలాంటి విన్యాసాలు అద్భుతంగా చేయగలదు–" అంది పార్వతీదేవి.

రాజేశ్వరి మొఖం సంతోషంతో విప్పారింది.

"ఓ! ఆ విషయం నాకొదిలేయండి. వారం రోజుల్లో మొత్తం వివరాలు సేకరిస్తాను–" అందామె ఉత్సాహంగా.

మర్నాడు మేమంతా కేవలం ఆశ్రమం ఎలా నడుస్తోందో చూడటానికన్నట్లు బయల్దేరాము.

శ్యామ్రావు మమ్మల్ని చిరునవ్వుతో ఆహ్వానించాడు. లోపల గదుల్లో పిల్లలందరి పక్కబట్టలు నీట్‌గా సర్ది ఉన్నాయ్. పిల్లలు పెరట్లో చెమటలు కక్కుతూ తోటపని చేస్తున్నారు.

"కమాన్ చిల్డ్రన్! మిమ్మల్ని చూడ్డానికి అంకుల్స్ వచ్చారు." అన్నాడు శ్యామ్రావ్ వాళ్ళతో. మరుక్షణంలో అందరూ వచ్చి మా ముందు రెండు లైన్లు కట్టి నిలబడ్డారు.

"మీ కందరికీ ఇక్కడ ఆనందంగా ఉందా?" అడిగాడు రంగారెడ్డి ఆత్రుతగా.

"ఓ! చాలా హాపీగా ఉన్నాము!" అందరూ చిరునవ్వుతో చెప్పారు.

"కడుపునిండా భోజనం పెడుతున్నారా?" అనుమానంగా అడిగాడు శాయిరామ్.

"ఓ! మాణింగ్ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం డిన్నరు, సాయంత్రం బిస్కెట్, టీ, రాత్రి

సప్పర్–"

అందరం మొఖాలు చూచుకున్నాం.

అలాంటి ఆహారం మేము కూడా భరించలేని పరిస్థితిలో ఉన్నాము. మరి శ్యామ్రావ్ అంత ఖరీదయిన మెనూ వాళ్ళకెలా సమకూరుస్తున్నాడో అర్థం కావటం లేదు.

ఆ తరువాత పదిహేను రోజులకు మళ్ళీ పెద్ద పార్శిల్స్ లారీలో శ్యామ్రావ్ ఇంటికొచ్చాయి.

ఆ తరువాత మరో వారానికి శ్యామ్రావ్ కలర్ టీవీ సెట్ కొనుక్కొని రావటం అందరం చూశాము.

మరో వారానికి శ్యామ్రావ్ మా కాలనీలోనే తన కుటుంబం కొడుకు కుటుంబం కోసం త్రీ బెడ్రూమ్ ఇల్లొకటి అద్దెకు తీసుకున్నాడు.

శ్యామ్రావ్ ఏదో మాయ చేస్తున్నాడని అందరికీ నమ్మకమయితే కుదిరింది గానీ ఏం చేస్తున్నాడో మాత్రం ఎవరికీ అంతుబట్టటం లేదు.

డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి ఇంకా తన 'పరిశోధన' పూర్తికాలేదని చెప్పేసింది.

"ఒకవేళ అనాథాశ్రమం అన్జెప్పి డొనేషన్లు పోగుజేసి తినేస్తున్నాడేమో!" తన అనుమానం వెలిబుచ్చాడు రంగారెడ్డి.

"అవునవును! ఆ విషయం వెంటనే ఆరా తీయాలి!" అన్నాడు శాయిరామ్. అప్పటికప్పుడే జర్నలిస్టు గోపాల్రావ్కి శ్యామ్రావు కార్యకలాపాలన్నీ కనిపెట్టి వివరాలు సేకరించే కార్యక్రమం అప్పజెప్పాం.

వారం రోజుల తరువాత గోపాల్రావ్ వివరాలతో వచ్చాడు.

శ్యామ్రావు ఎక్కడా డొనేషన్లు కోసం తిరగటం లేదు. కానీ రోజూ పోస్టల్ కరస్పాండెన్స్ మాత్రం చాలా విపరీతంగా జరుగుతోంది. ఉదయం సాయంత్రం పోస్టాఫీస్ కెళ్ళటమే అతని కార్యక్రమం–

మేమంతా మాట్లాడుతూండగానే రాజేశ్వరి తన పరిశోధన రిపోర్టుతో సహా వచ్చేసింది.

"పూర్తి వివరాలు దొరకటం లేదుగానీ– నాకు తెలిసిందేమిటంటే– శ్యామ్రావు ఆ పిల్లలందరికీ గంజినీళ్ళు రెండు సార్లు తాగించడం తప్పితే ఇంకేమి తిండి పెట్టడం లేదు. తరచుగా వాళ్ళని బెల్టు తీసుకుని వాతలు తేలేట్లు కొడుతున్నట్లు పనిమనిషి చెప్తోంది..."

అందరికీ ఆ పిల్లల మీద జాలి కలిగింది.

"వాళ్ళనెలాగయినా ఆ దుర్మార్గుడి బారినుంచి రక్షించాలి. వాడు తిండి పెట్టకుండా, అలా చావకొడుతూంటే మనంఎందుకు చూస్తూ ఊరుకోవాలి?" అన్నాడు జనార్ధన్.

''మనం చేయాల్సిన పనేంటంటే ముందు ఆ పార్శిల్స్ ఎక్కడి నుంచి ఎందుకొస్తున్నాయో, ఆ కరస్పాండెన్స్ ఎవరితో జరుపుతున్నాడో తెలుసుకోవాలి." అన్నాడు

రంగారెడ్డి.

అందరూ రంగారెడ్డిని బలపరచారు.

ఆ మర్నాడు అందరం ఆఫీస్‌కి శెలవుపెట్టి పోస్టుమెన్ కోసం ఎదురు చూడసాగాము.

మా ఇంటికి లెటరు ఇవ్వటాని కొచ్చి మా అందరినీ చూసి ఆశ్చర్యపోయాడు పోస్టుమన్.

"ఏం గురూజీ ఎమర్జెన్సీ మీటింగా?"

"అబ్బేకాదు. మీ కోసమే ఎదుర్చూస్తున్నాం రండి. ఇలా కూర్చోండి" అన్నాన్నేను. పోస్టుమన్ లోపలికొచ్చి కూర్చున్నాడు.

అతనికి శ్యామ్రావు 'అపూర్వ ప్రేమాశ్రమం' గురించి మా అనుమానాలు చెప్పాక అసలు విషయం కదిపాము.

"మరేం లేదు, అతను కరస్పాండెన్స్ ఎవరితో జరుపుతున్నాడు అనే వివరాలు కావాలి."

దాన్దేముంది సార్. నాకు తెలుసు ఆ అడ్రస్. ఆస్ట్రేలియాలో 'లవర్టన్' అనే ఊరు నుంచీ అతనికి పార్సెల్స్ ఉత్తరాలు తరచుగా వస్తుంటాయ్."

"అక్కడినుంచీ ఎవరు పంపతున్నారు?"

అతను తన సంచీలో నుంచి ఓ ఉత్తరాల కట్టతీసి అందులోనుంచి ఓ పెద్ద కవరు బయటకు లాగాడు

"ఇదిగో – ఫ్రమ్ అడ్రస్ చూడండి! 'లవర్టన్ లేడీస్ సొసైటీ' అన్న రబ్బరు స్టాంప్ ఉంది!"

అందరం ఆ కవరుని పరీక్షించాము.

"గురూ! వీడు పెద్ద ఎత్తున దేశాన్ని అముతున్నట్లున్నాడు. అసలే ఈ మధ్య విదేశీ గూఢచారుల గురించి రోజూ పేపర్లలో వార్తలొస్తున్నాయ్" అన్నాడు శాయిరామ్.

"ఒక్కసారి! ఈ కవరు ఓపెన్ చేసి చూస్తే బావుంటుంది!" అన్నాను పోస్టుమన్ వంకచూస్తూ.

"బాబోయ్ నా ఉద్యోగం పోతుంది..." భయంగా అన్నాడతను.

"నువ్ ఫికరు చేయకన్నా! ఈ సీక్రెట్ ఎవళ్ళతోను చెప్పం మళ్ళా" అన్నాడు యాదగిరి భరోసా ఇస్తూ.

ఎలాగయితేనేంఅరగంట సేపు బ్రతిమాలాక పోస్టుమన్ వప్పుకున్నాడు. వెంటనే జాగ్రత్తగా కవరు విప్పి ఉత్తరం బయటకు లాగాము.

ఉత్తరంలో నుంచి జలజలా కార్ట్‌సైజ్ ఫోటోలు బోలెడు కిందుకు రాలినయ్.

వాటిని చూస్తూనే అందరం ఆశ్చర్యపోయాము.

అవన్నీ 'అపూర్వ ప్రేమాశ్రమం'లోని పిల్లలవి.

అందరూ చిరిగి పేలికల్లా వేలాడుతున్న బట్టలతో ఓ ఫోటో!"

ఓ పిల్ల ఎండిన డొక్కలతో నేలమీద చచ్చిపోయినట్లు పడి ఉన్న ఫొటో! అందరూ ఆకలి బాధకు తాళలేక ఎంగిలి విస్తరాకులు నాకుతున్న ఫొటో–

ఇలా అన్నీ కటిక దరిద్రం చూపించే ఫొటోలే! ఏ ఫొటో చూసినా మనకు ఏడుపు కలగక తప్పదు. ఇంగ్లీష్‌లో ఉందా ఉత్తరం. గట్టిగా చదివాడు శాయిరామ్!

బీదల పాలిట జీసస్ క్రైస్ట్, శ్యామ్‌ రావ్,

మీరు ప్రతిరోజూ రాస్తోన్న ఉత్తరాలూ, మీ ఆశ్రమం పిల్లలు దారుణ పరిస్థితిని చూసే ఫోటోలూ మా కందుతున్నాయ్. అవి చూస్తుంటే మాకెవ్వరికీ మనశ్శాంతి ఉండటం లేదు. రాత్రుళ్ళు నిద్రపట్టడంలేదు. భారతదేశం మహా దరిద్రగొట్టు దేశమని మాకు తెలుసు గానీ– ఇలా చిన్నచిన్న పాపలు రోడ్ల మీదపడి ఆకలితో చచ్చిపోతుంటారని మాకింతవరకూ తెలీదు.

మీరు పంపిన ఆ ఫోటోలు చూశాక మేము ఛీలీ భూకంపం బాధితుల కోసమని సేకరించిన ఆహారం, బట్టలూ, సామగ్రీ, రగ్గులు– మొదలైనవన్నీ కూడా ముందు మీకు మళ్ళించాము.

మా సొసైటీకున్న ఫండ్స్ అన్నీ కూడా బాంక్ నుంచి విత్‌డ్రా చేసి మీ ఆశ్రమం కోసం పంపించాము. ప్రస్తుతం మా దగ్గర ఇంకేమీ డబ్బులేదు. మళ్ళీ ఇప్పట్లో పోగుజేసే శక్తి కూడా లేదు. ఎందుకంటే మావీ మధ్య తరగతి కుటుంబాలే! మీకో విషయం చెప్తే మీరు ఆశ్చర్యపోతారేమో!

భారతదేశంలో రోడ్లమీద ఆకలితో చనిపోయే పిల్లల ఫోటోలు చూశాక మేమంతా గత పదిహేను రోజులుగా ఒక్కపూటే భోజనం చేస్తూ ఆదా అయిన డబ్బు మీకు పంపాము.

దయచేసి మమ్మల్నింకా బాధించకండి! మా దగ్గరున్న సర్వస్వం మీ ఆశ్రమం కోసమే పంపించాము. ప్రస్తుతం మా సొసైటీ మెంబర్లందరం ఇంచుమించుగా కట్టుబట్టలతో ఉన్నామంటే అతిశయోక్తి కాదు. ఫండ్స్ అన్నీ అయిపోయిన కారణంగానూ, అప్పులెక్కువగా చేయాల్సి వచ్చిన కారణంగానూ మేము మా "లవర్టన్ లేడీస్ సొసైటీ"ని మూసివేస్తున్నాము. మీ భారతదేశం పిల్లల్ని ఆ భగవంతుడే కాపాడాలని మా ఆకాంక్ష!"

కొద్ది క్షణాల వరకూ మాకెవరికీ నోటమాట రాలేదు.

"అమ్మ రాస్కెల్! చూశారా– పాపం ఆ ఆడాళ్ళ క్లబ్‌ని పట్టుకుని ఎంత మోసం చేస్తున్నాడో! ఆ పెద్ద ఇంటికి అద్దె, ఆ స్కూటరూ, ఫ్రిజ్ కలర్ టీవీ అన్నీ వాళ్ళను ముంచే సమకూర్చుకున్నాడు" అన్నాడు శాయిరామ్.

ఉత్తరం మళ్ళీ అంటించి పోస్ట్‌మెన్ కిచ్చి పంపించివేశాం.

ఏదేమయినా సాయంత్రం శ్యామ్‌రావ్ ఆటకట్టేయాలని నిర్ణయించుకున్నాం.

అందరం కలసి ఆశ్రమానికి వెళ్ళేసరికి శ్యామ్‌రావ్ ఖంగారు పడ్డాడు.

పిల్లలంతా గదుల్లో కూర్చుని అగ్గిపుల్లలు లెక్కబెట్టి అగ్గి పెట్టెలో ఉంచుతున్నారు.

"చూశారా ఈ పిల్లల వల్ల రెండు లాభాలు–" అన్నాడు రంగారెడ్డి.

"ఆస్ట్రేలియా సొమ్ములు మంచిగా అందుతున్నాయా సార్?" అడిగాడు యాదగిరి. శ్యామ్రావ్ ఉలిక్కిపడ్డాడు గానీ వెంటనే సర్దుకున్నాడు.

"ఎంతోమంది సహాయాలు చేస్తే గానీ ఈ యజ్ఞం సజావుగా సాగదు" అన్నాడు చిరునవ్వుతో.

"పాపం. ఈ పిల్లల ముఖాలు చూస్తుంటే కేవలం గంజి తాగి బ్రతుకుతు న్నట్లుంది." అన్నాడు జనార్ధన్.

"భలేవారే! నా చిన్నారి పాపలను నేను పస్తుంచుతానా? నాకంఠంలో ప్రాణం ఉండగా ఆ పని జరగదు–"

అందరం అదో పెద్ద 'జోక్' అన్నట్లు గట్టిగా నవ్వాం.

"అబ్బ హబ్బ. ఏం జోకేశారు సార్." అన్నాడు రంగారెడ్డి కింద కూలబడిపోయి నవ్వుతూ.

"మీకు నామాట మీద నమ్మకం లేకపోతే ఈ చిన్నారి బాలలనే అడగండి నాయినా." అన్నాడు తాపీగా శ్యామ్రావ్.

శాయిరామ్ వెంటనే వెళ్లి ఓ కుర్రాడిని చేయిపట్టుకుని తీసుకువచ్చాడు, వాడు సన్నగా చీపురు పుల్లలా ఉండి– ఏక్షణాన్నయినా ప్రాణాలు వదిలేటట్లున్నాడు.

"ఒరేయ్. నిజం చెప్పమ్మా. రోజూ మీరు ఏమేం తింటున్నారిక్కడ?" అడిగాడు. జనార్ధన్ వాడిని అప్యాయంగా.

వాడు కళ్ళు మూసుకుని బట్టీ పట్టినట్లు గడగడా చదివేశాడు.

బ్రేక్ఫాస్ట్ రెండు గుడ్లు– నాలుగు బ్రెడ్స్లైసెన్– బటర్– ఒకగ్లాసు పాలు– మధ్యాహ్నం నాలుగు రొట్టెలు – అన్నం రెండు వెజిటేరియన్ కర్రీస్– పప్పు– పెరుగు– సాయంత్రం – ఎనిమిది బిస్కెట్లూ– పాలు– రాత్రి బ్రెడ్, అన్నం– రెండు కూరలూ– పప్పు– పెరుగూ నాలుగు రకాల పండ్లు–"

ఎవ్వరం మాట్లాడలేకపోయాం.

అవన్నీ తిన్నా వాళ్ళ ఆకారాలు అలా ఉన్నాయంటే– చాలా ఆశ్చర్యంగా వుంది.

"ఇంకా నమ్మకం కలుగలేదా నాయినా?" చిరునవ్వుతో అడిగాడు శ్యామ్రావ్.

"శ్యామ్రావ్! నువ్వు చేస్తున్నదంతా నాకు తెలుసు! పాపం ఈ పసిపిల్లలను అడ్డుపెట్టుకకుని ఆ పారినర్స్ని ఫూల్ చేస్తున్నావ్! వాళ్ళు పంపేవన్నీ అమ్ముకుని– నువ్వు డబ్బు సంపాదిస్తున్నావ్–" అన్నాడు జనార్ధన్.

"రేపే మా పేపర్లో హెడ్లైన్స్ లాగించేస్తాను. బాలల ఆశ్రమం పేరుతో విదేశీ

మహిళల దోపిడీ! నిర్భయ్‌నగర్ కాలనీ వాసుల సెన్సేషనల్ ఇన్‌వెస్టిగేషన్! ఎలా వుంది గురూ కాప్షన్?" అడిగాడు గోపాల్రావ్.

"అమాయకులారా! బాలల సేవే మాధవ సేవయని నమ్మినవాడిని నాయనా." మమ్మల్నందరినీ జాలిగా చూస్తూ అన్నాడు శ్యామ్రావ్.

రంగారెడ్డికి ఛటుక్కున ఓ ఉపాయం తట్టినట్లుంది. నా చెవిలో ఊదాడు.

"ఒండర్‌ఫుల్ అయిడియా" అన్నాన్నేను.

రంగారెడ్డి వెంటనే పక్కగదిలో గోడకు వేలాడుతున్న బెల్ట్ తీసుకుని ఓ కుర్రాడిని మా మధ్యకు లాక్కొచ్చాడు.

"ఒరేయి. నిజం చెప్పకపోతే బెల్టుతో చావగొడతాను. నీకు రోజూ తినడానికేమి పెడుతున్నాడ్రా శ్యామ్రావ్?"

వాడు ఏడుపు మొఖం పెట్టాడు.

"చెప్తే మీరెళ్ళిపోయాక నన్ను కొడతాడు..." అన్నాడు భయంగా.

"మేము నిన్ను మాతో తీసుకెళ్ళి పోతాంలే- చెప్పు త్వరగా-"

వాడు భయంభయంగానే చెప్పసాగాడు.

"మాకేమీ పెట్టడు, మధ్యాహ్నం, రాత్రీ కొంచెం గంజి ఇస్తాడు-"

"మరి ఇందాక గుడ్లు, బ్రెడ్, బటర్ అన్నావు గదురా"

"అవన్నీ చెప్పకపోతే కొడతాడు-"

శ్యామ్రావ్‌కి చెమటలు పట్టేసినయి.

"ఇదంతా మీకు అనవసరం వెళ్ళండి" అన్నాడు బెదిరింపుగా.

"సరే. రేపు జైల్లో కూర్చోవాల్సిన రాత నీకుంటే మేమేం చేస్తాం."అంటూ అందరం బయటకొచ్చేశాం.

మర్నాడు పొద్దున్నే రాజేశ్వరి అందరినీ తీసుకొచ్చింది మా ఇంటికి.

"ఏమిటి?" విషయం తెలీక అడిగాను

"ఆశ్రమం క్లోజ్ చేసేశాడు దొంగ రాస్కెల్-" అందామె.

"మరి పిల్లలు?"

"మళ్లా మన కాలనీలోకొచ్చేసి మన వరండాలో కూర్చున్నారు!"

మా అందరికీ సంతృప్తి కలిగింది.

"పోనీలే- ఎక్కడ ఆడుక్కుతిన్నా- స్వేచ్ఛగా బ్రతుకుతారు!" అన్నాన్నేను.